క్లుప్తంగా

రహదారుల నిర్మాణంతోనే గ్రామాల అభివృద్ధి



అమ్మవారి దారకొండలో సీసీ రోడ్డుకు ప్రారంభిస్తున్న ఎంపీపీ బోయినకుమారి

గూడెంకొత్తవీధి: రహదారుల నిర్మాణంతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బోయినకుమారి అన్నారు. మండలంలోని మారుమూల ఉన్న అమ్మవారి దారకొండ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ ముర్ల సత్యవతి, ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు, మండల కో-ఆప్షన్ సభ్యుడు దావీద్, వైస్ సర్పంచ్ చంటిబాబు, గాలికొండ సర్పంచ్ బుజ్జిబాబు, గ్రామపెద్దలు చిట్టిబాబు, రామారావు, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన



పెదబరడలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి: గిరిజన యువత గంజాయి పంట సాగుతో పాటు రవాణా కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన ఆదివారం పెదబరడ పంచాయితీ కేంద్రంలో గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత, రైతాంగం గంజాయి సాగుకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను అందిపుచ్చుకొని ప్రత్యామ్నాయ పంటలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా యువత చదువు, క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలన్నారు. తమ గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్పంచ్ గోపాల్, ఎంపీటీసీ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

118 మందికి వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు శ్రీనివాస్, చిత్రంలో నిర్వాహకుడు కాటంరెడ్డి

గంగవరం : మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్టు వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం జిల్లా అధ్యక్షుడు బొగ్గుల కాటంరెడ్డి అన్నారు. మోహనాపురం గ్రామంలో వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 118 మందికి డాక్టర్ శ్రీనివాస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వనవాసీ కళ్యాణ ఆశ్రమం హెల్త్ కమిటీ సభ్యులు సేవలు అందించారు. మాజీ జెడ్పీటీసీ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్‌లు అబ్బాయిరెడ్డి, రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శ్రమదానం



గుడి పరిసరాల్లో చెత్త, పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సాయిబాబా గుడి ఆవరణలో ఆదివారం ఉపాధ్యాయులు శ్రమదానం చేశారు. గత కొంతకాలంగా సాయిబాబా గుడి చుట్టూ చెత్త, పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు స్థానిక ఉపాధ్యాయులు అప్పలనాయుడు, కామేశ్వరరావు, ఎస్.ఎస్.ఎన్. మూర్తి, బి.రాజేష్, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, అప్పారావుతో పాటు వెలుగు ఏపీఎం దేవమంగలు తదితరులు ముందుకొచ్చారు. అందరూ సమష్టిగా శ్రమదానం చేపట్టారు. చెత్తను తొలగించి, పిచ్చి మొక్కలను నరికి శుభ్రం చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీంతో రోగాలు దరిచేరవన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.



ముంచంగిపుట్టులో వారపు సంత



ముంచంగిపుట్టు వారపు సంతలో షెడ్ల దుస్థితి



సంతలో కర్రలతో ఏర్పాటుచేసిన తాత్కాలిక దుకాణాలు

సంతల్లో సమస్యల చింత

- తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారం
- శిథిలావస్థలో షెడ్లు
- రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



వర్షం పడితే వారపు సంత పరిస్థితి

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో వారపు సంతల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. మన్యంలో గిరిజన రైతులు పండించే వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను అమ్మకాలు ప్రధాన కేంద్రాలు వారపు సంతల్లోనే... కానీ సంతలో ఎటువంటి కనీస సౌకర్యాలు లేక గిరిజన రైతులతో పాటు వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, లక్ష్మీపురం, భూసిపుట్టు, బంగారుమెట్ట పంచాయతీ కేంద్రాల్లో వారపు సంతలు జరుగుతాయి. ఈ ప్రాంతాల్లోని సంతల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయి. తాత్కాలికంగా కర్రలతో నిర్మించుకున్న పాకల్లోనే గిరిజనులు వ్యాపారాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూనే గిరిజన రైతులు కూరగాయాలతో పాటు అటవీ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.వారపు సంతల ద్వారా పంచాయతీలకు లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా సంత ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కానరాని సౌకర్యాలు

ముంచంగిపుట్టు మండల కేంద్రంలో సంతషెడ్లు నిర్మించిన ప్రస్తుతం అవి పూర్తిగా శిథలావస్థకు చెరుకున్నాయి.షెడ్లు పైకప్పు రేకులు పాడైపోవడం, గోడలు శిథిలమవడంతో షెడ్లు వినియోగంలోకి లేకుండా పోయాయి. సంత జరిగే ప్రాంగణంలో ఎటువంటి సీసీ రోడ్లు లేవు. దీంతో వర్షం పడితే సంతలోకి వెళ్లేందుకు భయపడాల్సిన దుస్థితి. సంతలో ప్రతి మార్గం చిత్తడిగా ఉండడంతో ఎక్కడ జారిపడిపోతామే తెలియని పరిస్థితి. లక్ష్మీపురం, భూసిపుట్టు, బంగారుమెట్ట వారపు సంతలోనూ ఇదే పరిస్థితి. సంతల్లో ఎక్కడ కుండా షెడ్లు లేవు. పాకలు వేసుకొని వాటిపై టార్పాలిన్లు కప్పి సంతల నిర్వహణ జరుగుతుంది. దీంతో పాటు సంతకు వచ్చే గిరిజనులకు తాగునీటి ఇబ్బందులు సైతం పడుతున్నారు. ముంచంగిపుట్టు వారపు సంతలో మాత్రమే తాగునీటి బోరు ఉంది. భూసిపుట్టు, బంగారుమెట్ట, లక్ష్మీపురం వారపు సంతల్లో తాగునీటి బోర్లు లేవు. దీంతో తాగునీటి కోసం వ్యాపారులు ,కొనుగోలుదారులు, గిరిజన రైతులు అల్లాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వారపు సంతలపై ప్రత్యేక దృష్టి పెట్టి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



వారపు సంతల్లో కనీస సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు, వానకు తాత్కాలిక పాకల్లోనే సంతల నిర్వహణ జరుగుతుంది. వర్షం పడితే సంత ప్రాంతం చిత్తడిగా మారుతుంది.నడవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో జరిగే ప్రతి వారపు సంతల్లో షెడ్లు నిర్మించాలి, తాగునీటి బోర్లు ఏర్పాటు చేయాలి. సీసీ రోడ్లు వేయాలి.

– కె.త్రినాథ్, సర్పంచ్, లక్ష్మీపురం పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ప్రతిపాదనలు పంపాం



వారపు సంతల్లో సమస్యలను ఇప్పటికై గుర్తించాం.నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము.ముఖ్యంగా సంత షెడ్లు ఏర్పటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పంపించడం జరిగింది. సంతలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారపు సంతల అభివృద్ధిపై దృష్టి సారిస్తాం.

– ఎం.శ్రీసాయిహర్ష, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం

పాడేరు : ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి ఆరు నెలల కాలంలోనే విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ మహిళ విభాగ జిల్లా అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం ఆరునెలలకే దారుణంగా మారిందన్నారు. ఏకంగా రూ.15,485కోట్ల విద్యుత్ చార్జీలను పెంచి పేద ప్రజల నెత్తిన శఠగోపం పెట్టారన్నారు. యూజర్ చార్జీల పేరుతో యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ఎన్నడూ ఇంత భారీ స్థాయిలో విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపలేదన్నారు. కూటమి ప్రభుత్వ మోసంపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన పాడేరులో పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సారథ్యంలో విద్యుత్ చార్జీలపై పోరుబాట కార్యక్రమం విజయవంతమైందన్నారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మతిభ్రమించి మాట్లాడుతున్నారని చెప్పారు. అమాంతంగా విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు ఎలా సమర్థించుకుంటారని వారు ప్రశ్నించారు. గిడ్డి ఈశ్వరి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీలపై వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం ఆమె దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల కోసం ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రజా మద్దతుతో సంపూర్ణం విజయవంతం అవుతుందన్నారు.

పేదలకు అండగా దాతలు నిలవాలి



బంగారంగరువులో పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీలోని రణంకోట, గొడ్డుమామిడి, బంగారంగరువు, దారగెడ్డ గ్రామాల్లో అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదివారం పర్యటించారు. ఈ నేపథ్యంలో లవ్ అండ్ కేర్ క్రైస్తవ మిషనరీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పేద గిరిజనులు, దివ్యాంగులకు రగ్గులను ఎమ్మెల్యే మత్స్యలింగం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో పేద గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి లవ్ అండ్ కేర్ స్వచ్ఛంద సంస్థ రగ్గులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ సేవలను కొనియాడారు. ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పేదలకు అండగా దాతలు నిలవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు కిల్లో మీనా, మాజీ ఎంపిపి బత్తిరి రవిప్రసాద్, నాయకులు లక్ష్మయ్య, వెంకట్, సాంభ, బాలన్న, శివరామ్, మధు, ప్రవీణ్, అప్పలరాజు, బొంజుబాబు, సంస్థ సిబ్బంది డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ



బొడ్డాపుట్టులో గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పాడేరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆ సొసైటీ ప్రతినిధులు మండలంలోని గొండెలి పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామంలో పేద గిరిజనులకు రగ్గులను ఆదివారం పంపిణి చేశారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి కలెక్టర్ ఆదేశాల మేరకు ఉచితంగా రగ్గుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గౌరీశంకర్ తెలిపారు. చలి కాలంలో పలు అనారోగ్య సమస్యలు తలేత్తే అవకాశం ఉందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యం చేస్తే అశ్రద్ధ చేయకుండా సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి తగిన వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు.సొసైటీ ప్రతినిధులు సూర్యారావు, లోహితాస్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీసా గ్రామ కమిటీ ఎన్నిక వాయిదా



సభకు అంతంతమాత్రంగానే హాజరైన స్థానికులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని పీసా గ్రామ కమిటీ ఎన్నిక వాయిదా పడింది. స్థానిక గ్రామ సచివాలయంలో ఆదివారం జరగాల్సిన పీసా గ్రామ కమిటీ ఎన్నికకు కోరం సంఖ్య సరిపడ లేదు. మండల కేంద్రంలో చేపట్టాల్సిన పీసా కమిటీ ఎన్నిక ప్రక్రియకు వాస్తవానికి కనీసం 1779 మంది రాకావాల్సి ఉండగా 79 మంది హాజరయ్యారు. దీంతో అధికారులు ఎన్నికను వాయిదా వేశారు. సకాలంలో సరైన ప్రచారం లేక పోవడం వల్లనే ఈ విధంగా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. పీసా ఎన్నికలపై పూర్తిస్థాయిలో ప్రచారం జరగాలని, ఆదివాసీలకు ఈ ఎన్నికలపై పూర్తి అవగాహన కల్పించాలని గిరిజన ప్రతినిధులు కోరుతున్నారు.

కొత్తాడ పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న సర్పంచ్ కామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు

గంగవరం : కొత్తాడ గ్రామ పంచాయతీలో కొత్తాడ, ఎర్రంపాలెం గ్రామాల పీసా గ్రామ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు కొత్తాడ సర్పంచ్ ఎస్.కామరాజు దొర తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారన్నారు. కొత్తాడ పీసా ఉపాధ్యక్షుడిగా చోడి కామన్న దొర , కార్యదర్శిగా చోడి నరసన్నదొరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. పీసా గ్రామసభ ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన కామన్నదొర, నరసన్నదొరలను సర్పంచ్ సారపు కామరాజు దొర, మాజీ సర్పంచ్ సంకురుదొర, గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

హైందవ శంఖారావానికి బస్సులు



తిమ్మాపురంలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రౌఢ్ ప్రముఖ్ వెంకటరత్నం

అడ్డతీగల: విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావానికి 27 బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రౌఢ్ ప్రముఖ్ వేణుం వెంకటరత్నం తెలిపారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విభాగాల సభ్యులు గ్రామాల్లో హైందవ శంఖారావ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం, వై.రామవరం మండలాలకే 27 బస్సులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మిగిలిన మండలాల్లోనూ మరిన్ని బస్సులు అందుబాటులోనికి తీసుకొస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



సుజనకోటలో ఆత్మీయ సమ్మేళనంలో సచివాలయ ఉద్యోగులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలోని మత్స్యగెడ్డ ఒడ్డున సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలో 18 గ్రామ సచివాలయ ఉద్యోగులు సుజనకోట గంగమ్మ ఆలయం వద్ద చెరుకొని సందడి చేశారు. వన భోజనాలు చేసి, థింసా నృత్యాలు, డాన్స్‌లు చేస్తూ, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. మండల సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పుణ్య కోటి వాహనంపై పురుషోత్తముడు



పుణ్యకోటి వాహనంపై స్వామివారిని తిరువీధి సేవలకు తీసుకెళ్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి తిరువీధి సేవలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు, పూజలు నిర్వహించారు. కొండ దిగువన ఉత్సవ మూర్తులకు, క్షేత్ర పాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని పుణ్యకోటి వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు జరిపారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై పాశురంతో నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. తదుపరి తీర్థగోష్ఠి, ప్రసాద వితరణ జరిగింది. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



జర్జులలో మాలధారులతో మాట్లాడుతున్న సురేంద్రస్వామిజీ

ముంచంగిపుట్టు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, దీంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సింహాచలం దేవస్థానం పీఠాధిపతి సురేంద్రస్వామిజీ అన్నారు. మండలంలోని కర్రిముఖిపుట్టు, జర్జుల పంచాయతీల్లో ఆదివారం సురేంద్రస్వామిజీ పర్యటించారు. గ్రామాల్లో లక్ష్మీ నరసింహ మాలధారణ భక్తులను కలిశారు. పలు ఆలయాలను సందర్శించారు. మాలధారులకు సింహాచలం దేవస్థానం ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. మాలధారులు పాటించాల్సిన నియమ నిబంధనలను తెలియజేశారు. ముంచంగిపుట్టు మండలంలో సింహాద్రప్పన మాలధారులకు దేవస్థానం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏటా గిరిజన ప్రాంతంలో లక్ష్మీనరసింహ మాలధారులు పెరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జర్జుల సర్పంచ్ పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, లక్ష్మీనరసింహస్వామి మాలధారణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలు సీజ్



అధికారులు సీజ్ చేసిన ఇసుక

ఎటపాక: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను ఆదివారం రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశాలతో తహసీల్దార్ సుబ్బారావు, సీఐ కన్నపరాజు ఎటపాకలోని ఇటుక బట్టీల వద్ద నిల్వ ఉంచిన నాలుగు ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్టు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి అక్రమంగా రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



మాడుగులలో పార్థసారథి స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

మాడుగుల: అతి పురాతనమైన పార్థసారథి స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం తిరువీధి ఉత్సవాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పార్థసారథి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. దీంతో గ్రామస్తులు ఎదురుగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని పులకించి పోయారు. అనంతరం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భోగి వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ప్రధాన అర్చకుడు పార్థసారథాచార్యులు తెలిపారు.

సారూ.. పట్టించుకోరూ!

- పగిలిన పైపులైన్
- వృథాగా తాగునీరు
- పట్టించుకోని అధికారులు



దుంబ్రిగుడలో పైపులైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రధాన హైవే రోడ్డు వద్ద ఉన్న డ్రైనేజీకి ఆనుకొని ఉన్న తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతుంది. ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుంబ్రిగుడ కేంద్రంలో అంతంత మాత్రంగా అందుతున్న తరుణంలో తాగునీరు వృథాగా పోతుండడంతో గిరిజనులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేపట్టి తాగునీరు వృథాగా కాకుండా చూడాలని, గ్రామానికి తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని వారు కోరుతున్నారు.